www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 3 మార్చి 2024



'ఆదిత్య'లో డిజైన్ థింకింగ్‌పై సెమినార్


ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐఐటి ప్రొఫెసర్‌చే శనివారం డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్, ఐఐటి నిర్వహించారన్నారు. ఐఐటి తిరుపతిలోని మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్, హెచ్‌ఒడి డాక్టర్ ఎం.రవిశంకర్ డిజైన్ థింకింగ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సాంకేతిక ప్రసంగాన్ని అందించారు. ఈ సెమినార్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేషన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆయన సమాజానికి ఉపయోగపడే వివిధ వినూత్న డిజైన్లను కూడా వివరించారు. వివిధ రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. 3డి ప్రింటింగ్ మిషన్ ద్వారా అభివృద్ధి చేసిన బయో ఇంప్లాంట్స్ యొక్క నిజమైన కేస్ స్టడీస్ గురించి చర్చించారు. కొత్త వినూత్న డిజైన్లతో కార్పొరేట్ కంపెనీలలో మంచి స్థానాలను పొందగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌ఒడి డాక్టర్ వివిఎస్ భాస్కర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సెక్టోరియల్ అధికారులకు సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని గవర్నర్ ఫంక్షన్ హాల్‌లో 2024-సాధారణ ఎన్నికల నిర్వహణపై సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎన్నికలు జరిగే సమయంలో ఎక్కడ ఏమి జరిగినా వెంటనే తమకు పంపాలన్నారు. పోలింగ్ పూర్తయి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొచ్చే పూర్తి బాధ్యత మీదే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్, వీల్ చైర్, విద్యుత్, తాగునీరు మరుగుదొడ్లు, వెబ్ క్యాస్టింగ్ చేయడానికి అవసరమైన విద్యుత్ సౌకర్యాలు అన్ని సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. వల్నరబిలిటి, క్రిటికల్, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి వెంటనే తమకు రిపోర్ట్ పంపాలన్నారు. సెక్టోరల్ అధికారులు ప్రజాశాంతియుతంగా అన్ని ముందస్తు ఏర్పాట్లు చూసుకొని మీకు కేటాయించిన రూట్లు, పోలింగ్ స్టేషన్ లను ముందస్తుగా పరిశీలించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు స్వేచ్ఛ వాతావరణం కల్పించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు చూడాలన్నారు. పిఒలు, ఏపిఒలకు సంబంధించిన ఫోన్ నెంబర్లను సెక్టోరియల్ అధికారుల వద్ద ఉంచు కోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం రూపొందించిన సి - విజిల్ యాప్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో సి - విజిల్ యాప్‌ను ఉపయోగించుకొని ఫిర్యాదులు చేయవచ్చన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి సమస్యలు తలెత్తిన స్పీకింగ్ ఆర్డర్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేయాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు ఓటర్లను సావధానంగా హ్యాండిల్ చేసే విధంగా చూడాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత రోజు చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు కేటాయించిన ప్రాంతంలోనే బస చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్లో ప్రతి ఒక్కరు 100 శాతం ఆక్టివ్ గా ఉండాలని చెప్పారు. ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్ పోర్ట్, ఎంప్లాయ్ ఐడి కార్డు, ఏదైనా ఒకటి గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్‌డిఒలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, డిపిఒ ధనలక్ష్మి, సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

608 మంది విద్యార్థులు గైర్హాజర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు 1వ తేదీ నుండి ఈ నెల 20వ తేదీ వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఒక నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించమనే అధికారులు చెప్పడంతో విద్యార్థులందరూ 30 నిమిషాలు ముందుగా హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు భాష పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,364 మంది విద్యార్థులు ఉండగా 11,756 మంది హాజరు కాగా 608 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ 11,345 మొత్తం విద్యార్థులు ఉండగా 10,819 మంది హాజరు కాగా 535 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 1010 మంది మొత్తం విద్యార్థులు ఉండగా 937 మంది విద్యార్థులు హాజరుకాగా 73 మంది గైర్హాజరయ్యారు. రాయచోటి పట్టణంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1908 మంది విద్యార్థులు ఉండగా 1826 మంది హాజరుకాగా 82 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 54, అడిషనల్ స్టాఫ్ సూపరింటెండెంట్ 26, ఫ్లేయింగ్ స్క్వాడ్ ముగ్గురు, 1065 ఇన్విజి లెటర్లను ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో గ్రామీణ ప్రాంతాలలో ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సును, పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం, తాగునీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు. జిరాక్స్ సెంటర్‌ను మూసి వేయించారు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించారు. వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య పరిశీలించారు.



విభిన్నప్రతిభావంతుడితో మాట్లాడుతున్న డిఐఇఒ కృష్ణయ్య

'వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి- రాయచోటి

ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వందశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్స్, గ్రామీణ అభివృద్ధి- ప్రాధాన్యత భవనాలు, ఎన్ఆర్ఇజిఎస్ - కరువు మండలాల్లో ఉపాధి పనుల కల్పన, తాగునీరు, పరిశ్రమల శాఖ - ఎంఎస్ఎంఇ క్లస్టర్‌లకు భూమి కేటాయింపు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ సత్యనారాయణ రావు హాజరయ్యారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ప్రాధాన్యత అంశాలలో సెక్టార్ వారీగా అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేసి రోజువారి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

ఈనెల 3న జిల్లా వ్యాప్తంగా చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమంలో నూరు శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, కంటి వెలుగు పథకం కింద ప్రభుత్వం నుంచి కంటి అద్దాలు అందగానే లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డులకు ఇకెవైసి పూర్తి చేసి లబ్ధిదారులందరికీ త్వరితగతిన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా మండలాలలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ముఖ్యంగా కరువు ప్రాంతాలలో సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ రూపొందించుకొని మెట్ట ప్రాంతాలలో ఫాం పాండ్స్, పెద్ద చిన్న పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం, మినీ అమృత సరోవర్లు నిర్మించడానికి కృషి చేయాలన్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ఇప్పటినుంచి తగిన ప్రణాళికలు రూపొందించుకొని, నీటి ఎద్దడి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా ఎంఎస్ఎంఇలకు ఉద్యం రిజిస్ట్రేషన్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మార్గదర్శకాలను అనుసరించి రబీలో కరువు మండలాల జాబితాను రూపొందించాలన్నారు. బెంగాల్ గ్రామ్, గ్రీన్ గ్రామ్ ప్రొక్యూర్ మెంట్, ఎరువుల పంపిణీ సక్ర మంగా నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు : ఆర్‌జెడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపి ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో పాలుపంచుకుంటున్న చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్ట్మెంట్ అధికారులకు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు జరగకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. డిఇఒ శివప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రెగ్యులర్ విద్యార్థులకు ఉదయం పూట, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి పరీక్ష ఉంటుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు తమకు కేటాయించిన కేంద్రంలో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులు ఉన్నాయా లేవో ఒకసారి చూసుకోవాలన్నారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను 16 కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ పరీక్షల రాష్ట్ర కో- ఆర్డినే టర్ అక్బర్ ఆలీ మాట్లాడుతూ విద్యార్థికి హాల్ టికెట్‌లో సబ్జెక్టు అయితే ఉంటుం దో అదే సబ్జెక్టు ప్రశ్న పత్రం జారీ చేయాలన్నారు. వేరే సబ్జెక్టు ప్రశ్నాపత్రం ఇచ్చి పరీక్షలు రాయిస్తే ఫలితాలు నిలిపివేస్తామని తెలిపారు. ఈ విషయమై ఇన్విజి లేటర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్లు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్

జగన్ పాత్రపై విచారణ జరిపించాలి : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లి

వివేకా హత్య కేసులో జగన్మోహన్‌రెడ్డి పాత్రపై విచారణ జరిపించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు జోలేపాలెం భవాని ప్రసాద్ అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందన్నారు. సిబిఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని తెలిపారు. మొదట సిబిఐ విచారణ కోరిన జగన్ తరువాత వద్దనడం వెనుక కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మదనపల్లి పట్టణ అధ్యక్షులు జోలేపాలెం భవాని ప్రసాద్, మోడెం సిద్దప్ప, నీలకంఠ, తులసీధర్ నాయుడు, దుర్గా ప్రసాద్, రవీంద్ర, సికిందర్, హరినాథ్, గంగ రాజు, మధు పాల్గొన్నారు. **రాయచోటి :** రాజకీయ లబ్ధికోసం వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందని, హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్ పాత్రపై విచారణ జరిపించాలని రాయచోటి టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో ఉన్న మండిపల్లి భవన్‌లో అయన కార్యకర్తలతో కలిసి మీడియాతో మాట్లాడారు. గొడ్డలి పోటుతోనే బాబాయి చనిపోయారు అని జగన్ అంత కచ్చితంగా ఎలా చెప్పారని, సిబిఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని ప్రశ్నించారు.అన్నారు. మొదట సిబిఐ విచారణ కోరిన జగన్ రెడ్డి తరువాత వద్దు అనడం వెనుక కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. సునీతమ్మ న్యాయ పోరాటానికి 5 కోట్లమంది పార్టీలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వాలని, ఆంధ్రులకు రక్షణ ఉండాలంటే కచ్చితంగా సునీతమ్మ చెప్పినట్లుగా జగన్ రెడ్డిని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రవీంద్ర రెడ్డి, రమణా రెడ్డి, బాల మురళి కృష్ణ , సూర్యనారాయణ రెడ్డి, నాగార్జున చౌదరి, బాల కొండ, వీరా రెడ్డి, ఓబుల్ రెడ్డి, నాగ శేషారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరచడానికి, అభివృద్ధిని వేగవంతం చేయడానికి నిర్వహించనున్న ఎంఎస్ఎంఇ సర్వేకు సహకరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈనెల 1 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాలో వార్డు అమెనటీస్ సెక్రటరీలు, ఎంఎస్ఎంఇ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్ ద్వారా చేస్తారన్నారు. జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎంపిడిఒలు వోలు, మున్సిపల్ కమిషనర్లు, జోనల్ మేనేజర్ ఎపిఐఐసి వారి పర్యవేక్షణలో సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వే పురోగతిని ప్రతి వారం కలెక్టర్ సమీక్షించి , తగు ఆదేశాలను జారీ చేస్తారని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఎంఎస్ఎంఇలను డిజిటల్ ప్లాట్ ఫారంలోనికి తీసుకురావడం, వీటిని ఎంఎస్ఎంఇ వన్ పోర్టల్‌కు అనుసంధానించడం, నమోదు కాని వ్యాపారాలను కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉద్యం, ఉద్యం అసిస్ట్ పోర్టల్ లో నమోదు చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. దీని ద్వారా వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హులు అవుతారని, బ్యాంకు రుణ సదుపాయాలు సులభతరం అవుతాయన్నారు. అన్ని రకాల దుకాణాలు, వ్యాపారాలు, తయారీ పరిశ్రమలు, సేవా పరిశ్రమలు ఇందులో భాగంగా సర్వే నిర్వహిస్తారని చెప్పారు. వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు తప్పకుండా సర్వేకు సహకరించాలన్నారు.



డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రీతూ డ్రైవింగ్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - సంబేపల్లె (రాయచోటి టౌన్)

సంబేపల్లె మండలంలోని దేవపట్లలో ప్రొప్రయిటర్ సుబ్రమణ్యం నాయక్‌చే ఏర్పాటు చేసిన రీతూ డ్రైవింగ్ స్కూల్‌ను శనివారం డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆవుల మల్లికార్జునరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. డ్రైవింగ్‌లో ఉత్తమ శిక్షణ, మెలకువలు నేర్పించి ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో తిక్కం ఆనంద రెడ్డి, జిలాన్, వలీ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అధ్యక్షతన ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజా వినియోగిత సేవలపై ఆయా శాఖలకు వచ్చిన కేసులను వెంటనే క్లియర్ చేయాలని అని సూచించారు. ఆయా శాఖ వారీగా కేసులపై సమీక్షించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవర ణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాల యంలో, లేదా 8639684279, 9963731698లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఇ రమణారెడ్డి, ఇఇ ఎన్.హరిసేవ నాయక్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి,-రాజంపేట అర్బన్

నందలూరు స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ యూత్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్, సైన్స్ ఫెయిర్ పోటీలలో ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రథమ స్థానం, సైన్స్ ఫెయిర్, వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారిని ఉపాధ్యాయ బృందం విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చక్కటి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక విజ్ఞాన దాయక కార్యక్రమాల్లో పాల్గొని మేధస్సును, శారీరక ద ృఢత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిఎండి షఫీ, ఎస్.శారదా, డి.శ్రీలత, పి.శివయ్య, పి.జనార్ధన్, దండుసుబ్బారెడ్డి, కె.వి.రమణనాయుడు, ఎస్.వి. రామరాజు, ఎన్.అమరావతి, ఎ.శివ ప్రసాద్, ఎస్.ప్రభాకర్‌రావు, మజ్జారి చెన్న కేశవులు, పిఎల్ఎన్‌వి. ప్రసాద్ రావు, పిడిఎంం ఈశ్వర్ నాయక్, పి.విజయ బాస్కర్, ఎం.రెడ్డి బాబు, బి.శేషగిరి, దార్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వాలని షర్మిలకు శ్రీనాథ్ వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ తనకు కేటాయించాలని పిసిసి అధ్యక్షులు షర్మిలకు శనివారం తిరుపతిలో వినతిపత్రం సమర్పించినట్లు పిసిసి కమిటీ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ తెలిపారు. తనకు టికెట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తానని పేర్కొన్నారు.



షర్మిలను కలిసిన శ్రీనాథ్

అభద్రత

ప్రజా'దృష్టి'

జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు బ్రేకులు పడట్లేదు. కడప, అన్నమయ్య జిల్లాలో రోడ్డు భద్రతా వారోత్సవాల ముగియక మునుపే మదనపల్లి, రాయచోటి కేంద్రాల్లో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మరణించడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్లకార్డుల ప్రదర్శనతో ర్యాలీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నిపుణుల సూచనల్ని అమలు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోంది. గత సోమవారం మదనపల్లి కేంద్రంగా ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను, లారీని, స్కార్పియో ఢీకొన్న ఘటనల్లో సుమారు తొమ్మిది మంది మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. మరుసటి రోజు రాయచోటి సమీపంలోని సరస్వతీపల్లి సమీపంలోని పట్టుపరిశ్రమల కేంద్రం దగ్గర లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మరణించడం ఆందోళన కలిగించింది. రోడ్డు ప్రమాదాల పరం పరకు అడ్డుకట్ట వేయలేమా అని ప్రశ్న నిరంతరం వేధిస్తూ ఉంటోంది. ఆస్పత్రికి వెళ్దామని ఇంటి నుంచి బయల్దేరిన ఓ తల్లీబిడ్డ, కుమారుడు అనంతలోకాలకు చేరుకోవడం సరస్వతీపల్లిని శోకసముద్రంలో ముంచింది. చేతికొచ్చిన బిడ్డల్ని రోడ్డు ప్రమాదాలు బలితీసు కుంటుండడం తీవ్ర మనోవేదనకు గురిచేస్తోంది. దీనికి బాధ్యులు ఎవరు? విధి విలాసమా, లేక సంబంధిత శాఖల తప్పిదమా అనేది ఆలోచన చేయాలి. రోడ్డుట్రాన్స్‌పోర్టు, ప్రజారవాణా శాఖ, పోలీస్ శాఖలు రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల వాహనదారులకు అవగాహన కల్పించడంలో తరుచుగా విఫలమవుతుండడానికి గల కారణా లేమిటో అన్వేషించాల్సి ఉంది. ఎక్కడ పొరపాటు దొర్లుతోందో గుర్తించి సరిచేయాలి. రోడ్ల మలుపుల దగ్గర హెచ్చరికల బోర్డులు, మార్కింగ్, హెచ్చరిక బోర్డులు, మెర్క్యూరీ లైట్లను ఏర్పాటు చేయడంతోపాటు వాహనచోదకులకు తరుచుగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లు పరీక్షల్ని నిర్వహించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని కడప-రాయచోటి ఘాట్‌రోడ్లు, రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్లు, చిట్వేలి-రాపూర్ ఘాట్‌రోడ్లలోని మలుపుల దగ్గర వేగనియంత్రణ యాంత్రికల్ని ఏర్పాటు చేయడం, లోయల వైపున కాంక్రీట్ వాల్స్ ఏర్పాటు చేయడం, రోడ్లను విస్తరించడం వంటి పద్ధతులను పాటించాలి. ఇటువంటి జాగ్రత్తలు తీసుకోనిపక్షంలో మానవ తప్పిదాల కారణంగా భావియువత తిరిగిరాని లోకాలకు వెళ్లడం బాధిత కుటుంబాల్లో అంతులేనిక్షోభను నింపినట్లు అవుతుందని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డు భద్రతా వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్లాలి. అప్పటి రోడ్డు ప్రమాదాల నివారణ బ్రహ్మపదార్థంగా గోచరిస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్న సింగపూర్, మలేషియా, దుబాయ్ వంటి దేశాల్లోని పద్ధతుల్ని పరిశీలించాలి. ఇక్కడి దేశీయ పరిస్థితులను బట్టి అమలు చేయడానికి ప్రయత్నించాలి. ఏదేమైనా రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి పద్ధతులను అనుసరిస్తే తగ్గుముఖం పడతాయోననే ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం అన్ని విధాలా సహకరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీలను కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు - 2024 కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఓటరు చేర్పులు, మార్పులకు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ దాదాపు పరిష్కరించామన్నారు. పెండింగ్ ఉన్న వాటిని వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎపిక్ కార్డుల జనరేషన్‌కు సంబంధించి జిల్లాకు వచ్చిన కార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడం పూర్తి చేశామన్నారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలకు సంబంధించి డెత్ ఓటర్లు, డబల్ ఎంట్రీలు, తదితర వాటిని అన్ని పరిష్కరిస్తున్నామని ఈ మేరకు అందరు ఆర్‌ఒలకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ మీడియాలలో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యల గురించి ఇఆర్‌ఒలను అడిగి తెలుసుకున్నారు. వచ్చేవారంలోగా రాజకీయ పార్టీలతో ఎన్నికల అంశంపై వర్క్ షాప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వర్క్ షాప్‌లో గుర్తింపు పొందిన ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆర్‌డిఒలు రంగస్వామి, మోహన్ రావు, హరిప్రసాద్, కోడూరు, పీలేరు, తంబళ్లపల్లె ఈఆర్‌ఒలు లీలారాణి, రమా, రాఘవేంద్ర, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్


తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాస్ నాయకులు

దళితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-కలికిరి

దళితుల రెవెన్యూ సంస్థల పట్ల అధికారుల నిర్లక్ష్యం తగదని బాస్ కన్వీనర్ పాలకొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. కలికిరి మండల సర్వేయర్ దేవి దళిత ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించారని తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాస్ కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ కలికిరి మండలం మేడికుర్తి గ్రామానికి చెందిన బంగి ఈశ్వరయ్య తన భూమిని సర్వే చేయాలని గత నెల 9న ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించారని అన్నారు. ఆ తర్వాత సచివాలయం సర్వేయర్‌ను సంబంధిత రైతు కలవడంతో మండల సర్వేయర్ దేవిని కలవాలని రైతుకు తెలిపారని చెప్పారు. గత నెల 10న రైతు బంగి ఈశ్వరయ్య మండల సర్వేయర్ దేవిని కలిసి సంబంధిత డాక్యుమెంట్ చూపించడంతో ఆమె సచివాలయం సర్వేయర్‌తో మాట్లాడి చెబుతానని చెప్పారని అన్నారు. తర్వాత కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతూ తన లాగిన్‌లో చూపించడం లేదు నిర్లక్ష్యం వ్యవహరించారని పేర్కొన్నారు. రైతుకు వెంటనే న్యాయం చేయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం నిరసన చేపట్టడంతో 5న సర్వేకు వస్తామని నోటీసు ఇవ్వడంతో నిరసనను విరమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వంగిమల్ల గురునాథ, కటారి గంగాధర్, నరసింహులు, కృష్ణమూర్తి, వెంకట రమణ, సురేష్ కన్నయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 316 మంది హాజరు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 316 మంది హాజరైనట్లు సిఎస్ఎం.రమణయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ కళాశాల, కస్తూరిబా గాంధీ కళాశాల, మహల్ ఉర్దూ బాలికల కళాశాల, శ్రీ సాయి కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలలో మొత్తం 332 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 16 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.


మహిళలతో వైసిపి నాయకులు

జగన్‌ను మళ్లీ సిఎం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

సంక్షేమ పథకాల ప్రధాత జగన్‌ను మళ్ళీ సిఎంను చేయడమే ప్రధాన లక్ష్యమని వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి వి.హరి తెలిపారు. శనివారం స్థానిక మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో ప్రచారం నిర్వహించి ఎంపీ పెద్దిరెడ్డి మిథునరెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని అత్యధిక మెజ రిటీతో గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేసి నేరుగా సొంత ఖాతాలో జమ చేసినటువంటి ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మూర్తి, నూర్ మహమ్మద్ కన్యాకుమారి, ధనలక్ష్మి, అలియా, విజయ్ కుమార్, వేమన్న, సతీష్, రహంతుల్లా పాల్గొన్నారు.


తల్లికి వందనం కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రదీప్

విజ్‌డమ్ స్కూల్‌లో 'తల్లికి వందనం'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని కొత్తబజార్‌లో గల విజ్‌డమ్ సెంట్రల్ స్కూల్‌లో కరస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్, అకాడమిక్ డైరెక్టర్ టి.మదన్‌మోహన్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లుల పాదాలను కడిగి పూలతో పూజించి వారి ఆశీస్సులు పొందారు. తల్లులు తమ పిల్లలను ఆప్యాయంగా ఆశీర్వదించారు. కరస్పాండెంట్ ప్రదీప్ విద్యార్థులకు తల్లి దండ్రుల ప్రాముఖ్యతను తెలిపి వారిని ఎలా గౌరవించాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.ప్రియాంక, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బి.కొత్తకోట : పట్టణంలోని పిటిఎం రోడ్డులో భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వేణుగోపాల్ రెడ్డిలు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి అమలు చేస్తుందో ఆ పార్టీకే భవన నిర్మాణ కార్మికులు అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ మేరకు వారి మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పవర్ ఫైనాన్స్ పేరుతో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను దారి మళ్లించి నవరత్నాలకు వాడుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైద్య ఖర్చులకు రూ.30 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న కోడూరు పట్టణానికి చెందిన ఎన్.నరసప్ప కి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.30వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైసిపి సుజాత, కొప్పరపు అరవింద్, నరసరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కావారి పల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, సాలవ రమణరాజు, అడపాల ప్రేమ్ కుమార్, గౌతంరాజు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కును అందిస్తున్న సాయి వికాస్‌రెడ్డి

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్రంలో విద్యారంగాన్ని విప్లవాత్మక మార్పులతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కొత్తపుంతలు తొక్కించారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.1.60కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. పాఠశాల తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ తరగతుల వల్ల కలిగే మేలును ఆయన వివరించారు. స్మార్ట్ టివిలు, ఐఎఫ్‌పిల ద్వారా పాఠ్యాంశాల బోధన విజయవంతంగా సాగుతోందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాథమిక స్థాయి నుంచి పెద్ద చదువుల వరకు విద్యా రంగంలో పెద్ద మార్పులును తీసుకు వచ్చారన్నారు. విద్యా రంగంలో 57 నెలల కాలంలో కేవలం పథకాల మీద రూ.73 వేల కోట్లు ఖర్చుపెట్టడం ఒక చరిత్ర అని అన్నారు. పేదరికం నుంచి బయటికి రావడానికి చదువు ఒక్కటే అస్త్రమని నమ్మి మానవ వనరుల మీద పెట్టుబడి పెడుతున్నారని అన్నారు. రూ.12 వేల కోట్ల నిధులతో నాడు నేడుతో పాఠశాలల అభివృద్ధి పనులును జగన్ ప్రభుత్వం చేసింద న్నారు. పిల్లలకు ఇచ్చే మంచి ఆహారం నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల దాకా అన్ని విషయాల్లోనూ వారి బాగోగులే లక్ష్యంగా నడుస్తోందని అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రణాళికా బద్ధంగా చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌జెడి రాఘవరెడ్డి, డిఇఒ శివప్రకాష్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకట రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథ రెడ్డి, వైస్ ఎంపిపిలు రవిశంకర్ రెడ్డి, బాబు, సర్పంచ్ అంజూమ్ సుల్తానా, ఆయూబ్, మాజీ ఎంపిపి నసిరూన్ సుల్తానా, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు అబ్దుల్ హుసేన్, జహరుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం : డిఐఒ


రాయచోటి : ర్యాలీని ప్రారంభిస్తున్న డిఐఒ డాక్టర్ ఉషశ్రీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పల్స్ పోలియోను విజయవంతం చేద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మార్చిన ఆదివారం అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి ఐదు సంవత్స రాల లోపు పిల్లలందరికీ నిర్దేశించిన పోలియో చుక్కలు బూత్ లలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1602 పోలియో చుక్కల బూత్‌లు ఏర్పాటు చేశామని, ఐదేళ్ల లోపు పిల్లలు 193946 మందికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య, విద్యా, స్త్రీశిశు సంక్షేమ శాఖల సిబ్బందికి, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 3న పోలియో చుక్కలు వేయించుకోకపోతే 4, 5ల తేదీలలో సంబంధించిన బూత్ సిబ్బంది ఇంటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. శనివారం రాయచోటి పట్టణ కేంద్రం లోని ఏరియా ఆస్పత్రి నుండి నేతాజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదాలు చేస్తూ నిర్వహి ంచారు. కావున ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పోలియో లేని సమాజ స్థాపనకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో డిసిహెచ్ఎస్.డాక్టర్ డేవిడ్ సుకుమార్, డిప్యూటీ డెమో దేవ శిరోమని, సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం:** తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలు మండలంలోని 13 పంచాయతీలలో 4072 మంది 0-5 సంవత్సరాలలో పిల్లలు ఉన్నారన్నారు. మండలంలో ఐదు రూట్‌లలో 47 బూత్ కేంద్రాలు, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక, అంగన్వాడీ, జిల్లా పరిషత్ పాఠశాలలోనూ రామాపురం బస్టాండ్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేర్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు. **నందలూరు:** నందలూరు నందలూరు మండలాన్ని పోలియో రహిత మండలంగా చేద్దామని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ అన్నారు. మండలంలో 4800 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయుటకు 48 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 5 రూట్లలో 5 మంది రూట్ సూపర్వైజర్లను వాహనాల ద్వారా ఉదయం 6:30 గంటలకు పల్స్ పోలియో కేంద్రాలకు వ్యాక్సిన్, పరికరాలు చేర్చుటకు ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్ఒ వెంకటనారాయణ పాల్గొన్నారు. **పీలేరు:** ఆదివారం నిర్వహించే పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కుమార్ తెలిపారు. రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలు 4,287 మందికి పోలియో చుక్కలు అందించడానికి 20 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను, ఒక మొబైల్ టీం, సిబ్బందిని ఏర్పాటు చేసామన్నారు. **కలకడ:** పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు కిషోర్ కుమార్ రెడ్డి, మల్లికార్జున లు తెలిపారు. మండలంలోని కలకడ, పాపిరెడ్డి గారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పల్స్ పోలియో కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమం లో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్, ఫార్మాసిస్ట్ షరీఫ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **వాల్మీకపురం:** పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని మండలంలోని నగిరి మడుగు పిహెచ్‌సి డాక్టర్ కీర్తి అన్నారు. సందర్భంగా డాక్టర్‌మాట్లాడుతూ ఆదివారం నగిరిమడుగు పిహెచ్‌సి పరిధిలో 20 బూత్‌లు, రెండు రూట్లు, ఒక్క మొబైల్ వాహనం ద్వారా పోలియో చుక్కలు వేయడం జరగుతం దన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఎవరైనా తప్పిపోయిన పిల్లలకు 4, 5వ తేదిల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలను వేస్తామన్నారు. 2835 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, తల్లిదండ్రులు కూడా సహకరించి, పోలియో రహిత సమాజానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పావని, మౌనిక, అమృత, గంగరత్న, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి..ఆదుకుంటా:'నల్లారి

ప్రజాశక్తి-కలకడ

వచ్చే సార్వత్రిక ఎన్నికలలో నన్ను ఆదరించి ఓట్లు వేయండి మీ అందరి వాడిని ఆదుకుంటానని పీలేరు టిడిపి అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ దిగుపాలెంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టిడిపిని గెలిపిస్తే అందరివాడుగా ఉండి మీ భవిష్యత్తుకు గ్యారెంటీగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం దిగుపాలెం పంచాయతీలో దిగుపాలెం, కుమ్మరపల్లి, గొల్లపల్లి దళితవాడలో ఆవులపల్లి, కోరేవాండ్లపల్లి గ్రామాలలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని ఈ నష్టాన్ని సరిచేయాలన్నా రాష్ట్ర ఆదుకోవాలని ఒక చంద్రబాబు నాయుడుకే సాధ్యమని కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు రాష్ట్ర కార్యనిర్వాహక ప్రతినిధి మదిపట్ల సూర్య ప్రకాష్ నాయుడు, మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మద్దిపట్ల వెంకటరమణా నాయుడునాయుడు శేఖర్ నాయుడు ఆవులప్ప గారి శ్రీనివాసులు నాయుడు మల్లికార్జున నాయుడు కాంతారావు, జిరాక్స్ అలీ, జిలానీబాషా, ఇర్ఫాన్ అహ్మద్ పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

తంబళ్లపల్లిని అభివృద్ధి చేసిన ఘనత వైసిపిదే : ఎమ్మెల్యే


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైసిపికే దక్కుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెద్దపాలెం, కదిరినాథునికోట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని పనులను వైసిపి ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి గ్రామానికి సిసి రోడ్లతో పాటు తారు రోడ్లు వేయడం జరిగిందన్నారు. వంద శాతం సంక్షేమ పథకాల అమలు చేసిన ఘనత వైసిపిదేనని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని సూచించారు. సమావేశంలో ఎంపిపి సాయిలీల, జడ్‌పిటిసి మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరెడ్డి, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, రాంబాబు, జయచంద్ర కుమార్, నాయకులు జనార్దన్‌రెడ్డి, రెడ్డి శేఖర్, విశ్వనాథ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : జడ్జి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

విద్యార్థి దశ నుంచే బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి ఫైజున్నిసా పేర్కొన్నారు. శనివారం ఎపి మోడల్ స్కూల్ హాస్టల్‌ను జడ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, మెనూ ప్రకారం అందరికీ భోజనం అందిస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లా డుతూ పదవ తరగతి , ఇంటర్మీడియట్ పరీ క్షలు జరుగుతున్నా యని కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచిం చారు. మారుమూల ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చారని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అ కాంక్షించారు. విద్య కు పేద ధనిక తేడా లేక తేడా లేదని ఎంత కష్టపడి చదివితే అంత మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అంతే కాకుండా బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని అన్నారు. బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాలని, బాగా చదువుకొని మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, న్యాయవాది సిద్దయ్య వార్డన్, పెద్దక్క సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అంకురార్పణ

కలకడ : శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా అంకురార్పణ ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు హెూమం నిర్వహించారు. అనంతరం త్రికోటం విజయ సారథి ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్యలో అంకురార్ప ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించి శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి వారికి పాత్రులయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అఖిలేష్, ప్రసాద్, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, శ్రీనివాస్ నాయుడు, నరసింహులు, మాధవ నాయుడు, సుధాకర్ నాయుడు, కుమార్‌నాయుడు, రెడ్డప్పనాయుడు, మల్లికార్జున నాయుడు రామ్ కిషోర్ శంకర పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలపై అవగాహన

తంబళ్లపల్లి : ఎస్‌బిఐ తంబళ్లపల్లి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో కన్నెమడుగు, రేణుమాకులపల్లి గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం ఎం.వి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత వారు బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు స్కీములు, సామాజిక భద్రత పథకాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జీరో అకౌంట్ , నగతురహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై మాటలు, పాటలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కె .చంద్రశేఖర్, క్యాషియర్ వెంకటేష్ పాల్గొన్నారు.


నిరసన ర్యాలీ చేస్తున్న టిడిపి,జనసేన నాయకులు

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గ పరిధిలోని బి.కొత్తకోట నుంచి పిటిఎం, ములకలచెరువు, తంబళ్లపల్లి, కురబలకోట మండలాల మీదుగా జనసేన -టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం మౌన నిరసన ర్యాలీ చేపట్టారు. తంబళ్లపల్లి జనసేన-టిడిపి ఉమ్మడి అభ్యర్థిని టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్రకటించిన తర్వాత చంద్రబాబు నివాసం ముందు తంబళ్లపల్లి నియోజకవర్గం టిడిపి, జనసేన నాయకులు నిరసన వ్యక్తం చేసిన సందర్భంగా త్వరలో పునఃసమీక్షించి అభ్యర్థిని సర్వేల ఆధారంగా ప్రకటిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఆ ప్రకటన ఆలస్యం కావడంతో బి.కొత్తకోట కొండ ఎస్టేట్ నుంచి కొండ నరేంద్ర అభిమానులు ఈ మౌన నిరసన ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టినట్లు వారు తెలిపారు.

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక చేనేతనగర్‌లో గల మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.రామాంజినేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొనుటకు బిసి, ఇబిసి కులాలకు చెందిన విద్యార్థులు 9 నుంచి11 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాల నందు విద్యాభ్యాసం చేసి ఉండి, రెగ్యులరుగా 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. దరఖాస్తులను వెబ్ సైట్ https://mipapbcwreis.apcfss.in నందు చేసుకో వాలన్నారు. దరఖాస్తులకి మార్చి 31,2024 ఆఖరి తేదీ అని ఆయన వెల్లడించారు. నమోదు చేసుకొన్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు జరుగుతాయన్నారు .ప్రవేశాలకు అర్హత పొందిన వారికి పూర్తి ఉచితంగా విద్య,భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ పిలుపునిచ్చారు. **రామాపురం:** ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సినల్ ఎస్ఎండి అప్రోచ్ బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2 నుంచి ఈనెల 31 వరకు విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 వరకు స్థానిక ఆదర్శ పాఠశాలల్లోనే ఉంటుందన్నారు. విద్యార్థులకు 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో మాత్రమే బోధిస్తారని, చదువుకో వడానికి ఎలాంటి ఫీజులు కట్టనవసరం లేదని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఒసి, బిసి విద్యార్థులు రూ.150, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.75లు చెల్లించా లన్నారు.

మల్లయ్యకొండ హుండీ ఆదాయం రూ.5 లక్షలు

తంబళ్లపల్లి : తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీ ద్వారా కానుకల రూపంలో రూ.5లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్.మల్ రెడ్డి, ఇఒ రమణలు తెలిపారు. టిటిడి పరకామణి మహిళా సేవకులు కానుకలను లెక్కించారు. రెండు మాసాలకే ఐదు లక్షల పైగా ఆదాయం రావడం పై భక్తులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి కృషి ఫలితంగా మల్లయ్య కొండ ఆలయం దినదిన అభివృద్ధి చెందుతుందని అన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం సభ్యపల్లిలో బిరియాని హోటల్ నిర్వాహకుడు షంషీర్ తన ప్రాణ మిత్రుడు జర్రి పోతుల వెంకటరమణ వర్ధంతి రోజున జ్ఞాపకార్థం పేదలకు బిర్యానీ పంచి పెట్టారు. ప్రతి ఏడాది స్నేహితుడి జ్ఞాపకార్థం అన్నదానం చేస్తున్నానని తెలిపారు.


భోజనాన్ని వడిస్తున్న షంషీర్

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వివరాల మేరకు.. సిఐ సూర్యనారాయణ ఉత్తర్వులు మేరకు ఎఎస్ఐ బొజ్జానాయక్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా, గౌనుపల్లి శ్రీనివాసపురంకు చెందిన జికె.మహమ్మద్‌రఫీ అనే వ్యక్తి స్థానిక గొల్లపల్లి కనికలతోపు రోడ్డుపై రైల్వే ట్రాక్ దగ్గర కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అతనిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం మదనపల్లి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. పట్టుబడిన కర్ణాటక మద్యం 144 ప్యాకెట్లు విలువ రూ.5900లు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ నాగేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-గాలివీడు

ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గుండ్లచెరువు సచివాలయం ఎదురుగా ఉన్న చింత చెట్టు కింద పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.6600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని సోమవారం లక్కిరెడ్డిపల్లి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం..

మండలంలోని ఎగువగోట్టివీడు వద్ద ఓ గృహంలో ఉన్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట ప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా దాచివుంచిన మద్యం లభిస్తే వారిపై కేసు నమోదు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిధిలోని మద్దినాయునిపల్లిచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై కర్ణాటక రాష్ట్రం దావనగిరి జిల్లా, సుడికేర్‌వసల్లికి చెందిన నాగప్ప కుమారుడు ఫకీర్(30) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువుల వివరాల మేరకు..మద్దినాయునిపల్లి గ్రామానికి చెందిన కిరణ్‌కు రోజు సహచరులతో కలసి చేపలు పట్టి ఇస్తుంటాడు. శనివారం ఉదయం చేపలు పడుతుండగా, ఫకీర్ తలకు విద్యుత్ వైర్లు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడని అన్నారు. చెరువులో చేపలు పడుతున్న సహచరులు గుర్తించి బాధితుని చికిత్స కోసం వెంటనే 108 సిబ్బంది మస్తాన్, బావాజాన్ ల సాయంతో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, ప్రథమ చికిత్సల అనంతరం అతని పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కుటుంబీకులు వెంటనే అతన్ని బెంగుళూరుకు తరలించారని తెలిపారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ వైర్లు చెరువులో తలకు తగిలే అంత ఎత్తులో వేలాడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు చెరువులో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని వారు మండిపడ్డారు. పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.